# అసలు సంగతి!

“అందంగా పెళ్ళయ్యి రెండు నెలలైనా కాలేదు అప్పుడే ఇద్దరి మధ్య గొడవలా? ఏదీ కిష్టమూర్తిని ఇలా పిలు...” భార్య భాగ్యాన్ని ఉద్దేశించి అన్నాడు విశ్వం. ఆ మాట వినగానే భాగ్యం కళ్ళు చిట్లించి “కందకు లేని దురద కత్తిపీటకెందుకని ఊరకనే అనలేదు. ఆ కిష్టమూర్తి గొడవ తెలిసి కూడా ఏం జరిగిందని అడగటానిక్కి వాళ్ళ తాలూకూ ఎవ్వరూ రాలేదు. మనకెందుకట? మీరు నోరు మూసుకు కూర్చోండి. అయినా ఆ పిల్లదేమీ తప్పుండదు. ఇహపోతే ఆ కిష్టమూర్తి సంగతి మనకి తెలియంది కాదు. చిన్నమొన్నటి దాకా దేన్ని బడితే దాన్ని వెంటేసుకొని అడ్డమైన తిరుగుళ్ళకు అలవాటు పడటమే, ఈ రోజున వాడి భార్య అయిన పాపానికి ఏం కష్టమొచ్చిందో? ఏదో అనరాని మాటంటే, ఎంత బాధ కలిగి ఏం మాట అనేసిందో? ఏమో బాబు! అయినా మనకెందుకులే...” చిరాకుపడుతూ చెప్పింది భాగ్యం.

“అదేమిటే? ఎంతయినా ప్రక్క పోర్షనులో ఉంటున్నవాళ్ళం. ఆ మాత్రం మాటసాయం అయినా చెయ్యకపోతే ఎలా? అయినా మీ ఆడాళ్ళకి మగాళ్ళని ఆడిపోసుకోవడం బాగా అలవాటయిపోయింది. అసలు ఏమయ్యిందో, ఏమిటో తెలుసుకోకుండా కిష్టమూర్తి మీద నింద వెయ్యడం బాగోదూ! ఎంత కాదనుకున్నా ఒకేచోట పనిచేస్తున్నామాయే. కిష్టమూర్తికి నువ్వన్నట్లు అమ్మాయిల పిచ్చి ఉండొచ్చు. కానీ కట్టుకున్న పెళ్ళాన్ని హింసించేంత మూర్ఖుడు కాదని నా అభిప్రాయం. సరేలే ఇప్పుడు పోయిందేముంది? రేపు డ్యూటీలో కల్సినప్పుడు మెల్లగా కదలేస్తే జరిగింది మొత్తం ఒకథలా చెప్పేస్తాడు— సర్లే నువ్వెళ్ళి పనిచేసుకో...” అంటూ పేపర్లో తల దూర్చేసి కూర్చున్నాడు విశ్వం.

భాగ్యానికి మాత్రం కిష్టమూర్తి మీద మంచి అభిప్రాయం ఎంతమాత్రం లేదు. అతనికి పెళ్ళవ్వక ముందు అర్ధరాత్రిళ్ళు తలుపుకొట్టే “అంటే! కాసిన్ని మంచినీళ్ళవ్వండని” ఎన్నిసార్లు తనని విసిగించలేదు. అదీ నా భర్త డ్యూటీలో ఉండగా— రాత్రిళ్ళు తలుపు తడుతుంటే ఎవరైనా ఏమనుకుంటారు? వెధవ వెకిలి చూపులు చూస్తూ, నకిలీ నవ్వు నటిస్తూ ఎంతమందిని మోసం చేశాడో ఏమో? పాపం ఏనాడు ఎంత పాపం చేసుకుందో అమాయకురాలు సక్కుబాయి ఈ కిష్టిగాడి పెళ్ళామయ్యింది. ఏం చెప్పగలం ఎవరికెవరు రాసి పెట్టుంటే అది తప్పదు కదా! అంతా ఆ పైవాడి లీల! మనసులోనే అనుకుంటూ పైవాడ్ని తలుచుకుంటూ వంటపనిలో పడింది భాగ్యం.

వంట చేస్తుంటే గాని మనసు— మనసులో లేదు. “అసలు ఏమయ్యిందో తెలుసుకోవాలి” అలా అనుకుంటూనే నాలిక్కరుచుకుంది. ఇందాకే కదా ఆయన్ని కంధా, కత్తిపీట అని సాగదీశాను మనకెందుకని— ఊరుకుంటే వెధవ అనుమానంతో నిద్రపట్టి చావదే! ఏదీ ఏమయినా సరే అసలు సంగతి తెలుసుకోవాలి. గట్టిగా ఓ నిర్ణయానికొచ్చేసింది భాగ్యం.

సినిమాల్లో విలన్‌లా కళ్ళు మూసుకుని పైకి లేచింది. ఓ డిటెక్టివ్‌లా కళ్ళు తెరిచి వరండాలో ఉన్న విశ్వాన్ని చూసింది. ఆయనగారు ఇందాకెప్పుడో దూర్చేసిన తల ఇంకా పేపరులోంచి తీయలేదు. “హమ్మయ్య! ఫర్వాలేదు!” గుండెల మీద చేతుల్తో తాళం వేసుకుంటూ, తలకాయని ఒకసారి అటూ, ఇటూ ఆడించేసుకుని దొడ్డి గుమ్మాన్ని సింహద్వారంగా తల్చుకుని, ప్రక్క పోర్షనులో ఉన్న సక్కుబాయి ఇంట్లో ఆరాటంతో అడుగుపెట్టింది శ్రీమతి భాగ్యం.

అప్పటిదాకా సీరియస్‌గా “మహాపతివ్రత” నవల చదువుతున్న సక్కుబాయి భాగ్యాన్ని చూడగానే “అక్కా” అంటూ అరుపుతో కూడిన ఏడుపును తెచ్చేసుకుని అమాంతం భాగ్యం గుండెల మీద తలకాయను పడేసి “దభీదభీమని” గుద్దుకుంటూ “నేను అన్యాయంగా కిష్టమూర్తికి బలయిపోయానక్కా” అని బావురుమంటూ తలకాయని మరింత గట్టిగా కొట్టుకోవడం మొదలెట్టింది. సక్కుబాయి దాడికి తట్టుకోలేని భాగ్యం కంగారుపడుతూ “ఊరుకోమ్మా బాధపడకు, అసలు ఏమయ్యింది” చిలక గోరింకల్లా ఉండేవారు ఏడవకు” అంటూ బలంగా తన గుండెల మీదున్న సక్కుబాయి తలకాయని తీసి నిలబెట్టింది.

“బుగ్గలు కందిపోయాయని, కళ్ళు ఎర్రగా అయ్యాయనీ, మనిషి సగమయ్యావని, వాడ్ని కట్టుకున్న పాపానికి ఈ కొద్దిరోజుల్లోనే చీపురు పుల్లలాగా తయారయ్యావని” కనీ వినీ ఎరుగని అభిమానాన్ని కురిపించేస్తూ, ఎలాగయినా సరే జరిగిందేమిటో తెలుసుకోవాలనే పట్టుదల పెరిగిపోతుండగా సక్కుబాయి బుగ్గల మీదుగా కారుతున్న కన్నీళ్ళను సీరియస్‌గా తుడిచేసింది భాగ్యం.

ఎవరు ఏమనుకున్న తన గాధంతా చెప్పి సానుభూతి పొందాలని ఓ గట్టి నిర్ణయానికొచ్చేసింది సక్కుబాయి. చీరకొంగుతో మొహాన్ని తుడుచుకొని ఓసారి ముక్కు చీదుకొని, పమిట కొంగు నడుముచుట్టూ బిగించి కిష్టమూర్తిగారి లీలలు చెప్పడం మొదలెట్టింది.

భాగ్యం చెవుల్ని కప్పవోరులా తెరిచేసింది. సక్కుబాయి మొదలెట్టింది. కళ్ళు పెద్దవి చేసుకొని గుసగుసల రాగలతో, అరచేతుల్తో గుండెల మీద తాళాన్ని శృతి వేసుకుంటూ చెబుతోంది. చెప్పిందే చెప్పి చెప్పేసి తిరిగి ఏడుపు మొదలెట్టాలా? వద్దా? అని సక్కుబాయి ఆలోచిస్తుండగానే, భాగ్యం ఎక్కడలేని వూపుతో, ఆనందంతో దొడ్డి గుమ్మం మరచిపోయి అమాంతం గోడదూకి తనింట్లో పడిపోయింది.

భాగ్యం నోట్లో నువ్వుగింజ జారిపోతుంది. భర్త విశ్వాన్ని కేకపెట్టింది గట్టిగా “ఏమండోయ్” అని, ఆ కేకకి ఉలిక్కిపడిన విశ్వం చదువుతున్న పేపర్ని సగం చింపేశాడు. “అబ్బ అదిరిపోయానే, ఏం కొంప మునిగిందని ఆ అరుపులనూ, పెడ బొబ్బలనూ” విసుగ్గా ముఖం పెట్టి విసుకున్నాడు విశ్వం.

“ఏమిటండీ మొహం అలా పెట్టారు. నే చెప్పేది వినండీ, ఆ కిష్టమూర్తి గురించి సక్కు

నిమ్మలపూడి రమేష్ కుమార్

బాయి మొత్తం చెప్పేసిందండీ, నిజానికి అది మంచిది కనుక ఈన్నాళ్ళయినా వాడ్ని భరించింది. అదే నైనేతే వారంలో అటో, ఇటో తేల్చేసేదాన్ని...'' అంటూ తోంబయి శాతం ఝాన్సీరాణిలా ఫోజుపెట్టి నిలబడిపోయింది భాగ్యం.

ఓ పక్క నుంచి సస్పెన్స్‌ను భరించలేక సహనాన్ని చంపుకుంటూ జరిగింది చెప్పమని రెచ్చిపోయాడు విశ్వం.

''ఏం జరిగిందంటే' చెప్పుకుంటే సిగ్గుకుడానూ! పెళ్ళయిన వారం రోజులకే మొదలెట్టాట్ట! చదువుకున్న రోజుల్లో వీడికే ఏ కోరికలు తీరలేదని, ఎవర్ని ప్రేమించలేకపోయాననీ, ప్రేమలేఖలు రాసే ధైర్యం కూడా ఉండేది కాదనీ నువ్వేమీ అనుకోకపోతే సరదగా ప్రేమలేఖలు రాసుకుందామని ఇకిలించుకుంటూ అడిగేడంట! సక్కుబాయి ఈ విషయాన్ని తీవ్రంగా ఆలోచించి సొంతామొగుడే కదాని సరదాకి సరే అందంట. కిష్టమూర్తి డ్యూటీకి వెళ్ళేటపుడు ఓ ప్రేమలేఖ రాసిస్తే, ఆయనగారు తిరుగొచ్చేటప్పటికి సక్కుబాయి ఓ ప్రేమలేఖ రాసిచ్చేదంట...'' అని చెప్పి నోటి మీద అడ్డంగా అరచేతిని పడేసి నిలబడిపోయింది భాగ్యం విశ్వాన్ని చూస్తూ.

విశ్వం ఓ ఒంకర నవ్వు నవ్వి— ''ఇంతేనా! ఇది అంతా ప్రమాదమయింది కాదీ?'' అనేసి మళ్ళీ పేపరు చూస్తున్న విశ్వం వీపు మీద ధబాల్న ఓ చరుపు చరిచింది. ఒళ్ళు మండిన విశ్వం 'అదేం రోగం' అనేంతలో భాగ్యం మళ్ళీ మొదలెట్టింది'' ప్రమాదం కాదంటారేమేమిటీ? అక్కడే చిక్కొచ్చింది... ఈ ప్రేమలేఖల వ్యవహారం కనిపెట్టిన పక్కింటి కుర్రాడు కూడా ఓ రోజు సక్కుబాయిని ఓ ప్రేమలేఖతో కొట్టాడంటా...''

''ఆ! సమాధానం రాసిందా?'' కుర్చీలోంచి అమాంతంగా లేచి, ఆనందంగా అడిగేశాడు విశ్వం— కోపం పట్టలేక మళ్ళీ ఓ చరుపు చరిచింది'' చెప్పేది సరిగ్గా వింటారా నన్ను లోపలికి పొమ్మంటారా...'' విసుగ్గా అడిగింది భాగ్యం.

''చెప్పు!'' సర్దుకుని కూర్చుంటూ అన్నాడు విశ్వం— మళ్ళీ మొదలెట్టింది భాగ్యం.

''ఆ కుర్రోడు రాసిని ప్రేమలేఖ విషయం కిష్టమూర్తికి చెబితే అగ్నిహోత్రుడో, దేవదాసో అయిపోతాడని భయమేసి మొగుడికి మంచి మాటలు చెప్పి ఈ ప్రేమలేఖల వ్యవహారం మాన్పించిందట.''

''అహా! తెలివైందీ?'' సక్కుబాయిని మెచ్చుకునే ధోరణిలో విశ్వం కళ్ళు మూసుకుని తలాడిస్తుంటే, ఉన్నట్లుండి విశ్వాన్ని గిరగిరా తిప్పి కొట్టాలన్నంత కోపం వచ్చింది భాగ్యానికి, ఎంతయినా ఆడది కదా! సక్కుభాయిని మెచ్చుకోవడం ఇష్టంలేక పళ్ళు పటపటమని కొరుక్కుని మళ్ళీ మొదలెట్టింది భాగ్యం.



"ఇంతటితో ఆగిపోతే బాగుద్ను. ఈవ్వాళ ఉదయం మరీ ఘోరమండీ తెలుసా?" కళ్ళు పెద్దవి చేసుకుని మరీ అంది, ఈ విషయాన్ని మరీ రహస్యంగా చెప్పాలని విశ్వం మీద మరి వంగి ఆగలేక మీద పడిపోయింది. భాగ్యం బరువును తట్టుకోలేక కుర్చీ మీద నుండి క్రింద పడి మళ్ళీ సర్దుకుని కూర్చున్నాడు విశ్వం.

కిష్టమూర్తి రాత్రి ఇంటికొచ్చినప్పుడు మల్లె పూలు తెచ్చి, సక్కుబాయికి ఇవ్వకుండా చేతికి సిమెంటు కట్టులా కట్టుకుని, సక్కుబాయిని అమాంతం వాటేసుకుని ఇష్టం వచ్చినట్లు వలి పేశాడంట." పాపం. ఈ అమాయక శిరోమణి ప్రేమ ఎక్కువయితే ఇలాగే ఉంటారేమోనని సర్దుకుపోయిందంట. తెల్లారి లేచి..." చెబు తూ ఆగి మట్టూ చూసి మళ్ళీ చెప్పింది భాగ్యం ... "తెల్లారి లేచి ఇంకా నిద్రలో ఉన్నా సక్కుబాయిని లేపి ఏభయినోటిచ్చి ఈసారికి దీంతో సరిపెట్టుకో, మళ్ళీ వచ్చినప్పుడు ఇస్తాలే..." అన్నాడంటూ విత్కారంగా అంది భాగ్యం.

ఈ మాట విన్న సక్కుబాయి ఎంత బాధకు గురయ్యిందో తెలియదు గాని, సక్కుబాయికి ఏభయి రూపాయలిచ్చింది పక్కింటి కుర్రోడు. ఎవరో అర్థం గాక విశ్వం మాత్రం బుర్రమీద రెండు చేతుల్తోను బాదుకుంటూ క్రింద పడి పోయాడు. ఎందుకంటే— ఆ రాత్రి ఆఫీసు పని ఎక్కువగా ఉండటం వలన ఆఫీసులోనే తాను క్రిష్టమూర్తి ఉండిపోయామని తెలిసిన విశ్వం.

భాగ్యం స్థాణువులా నిలబడిపోయింది విశ్వాన్ని చూస్తూ.

**ఏం తింటారు?**

"మీరు ఇలా బలంగా, దారుఢ్యంగా, శక్తి వంతంగా ఉన్నారు కదా! మరి మీరు ఏం తింటారు?"

"ఏముంది మా ఆవిడ దెబ్బలే తింటా అందుకొరకే ఇలా..." నవ్వుతూ అన్నాడు వస్తాద్.

**భయపడతారు**

"మా ఇంట్లో మా నల్ల కుక్కను చూసి మా నాన్న కూడా భయపడతాడు తెలుసా" రవి.

"మా ఇంట్లో అయితే మా అమ్మను చూసి మా నాన్నతో సహా అందరూ భయపడాల్సిందే తెలుసా."

— మేఘరాజ్.


అప్పుడు ఎర్రకలువ

మొన్న మల్లెపూవు

నిన్న డైనమైట్

నేడు

యుద్ధభూమి

మీ అభిమాన రచయిత

డా. కె. కిరణ్ కుమార్ సీరియల్

"యుద్ధభూమి"

సబ్జెక్టులో కొత్తదనం

శైలిలో నూతనత్వం

పదాలలో పరుగు

వీటి మేటి కలయికే 'యుద్ధభూమి' సీరియల్